'పూలే స్ఫూర్తికి విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ'

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ



జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: రాష్ట్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తికి విరుద్ధంగా పని చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మహాత్మాజ్యోతి రావు పూలే జయంతి వేడుకలు డప్పు మల్లికార్జున్ నేతృత్వంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందు నరేష్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు రెండు ఎంపీ స్థానాలు మాత్రమే ఇచ్చి 4 శాతం జనాభా లేని రెడ్డిలకు 6 ఎంపీ స్థానాలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ బీసీలకు ద్రోహం చేసిందన్నారు. 12 శాతం జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా మాదిగలను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పలికే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో బొర్ర భిక్షపతి, శివ, రాజశేఖర్, శివప్రసాద్, సాయికుమార్, దేవేందర్, సుజాత, వేణుగోపాల్, రఘు, మహేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ప్రొ.కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న యూనివర్సిటీల పార్ట్ టైం టీచర్లు

లాలాపేట: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం గురువారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా సంస్కరణల కమిటీ సభ్యులు ప్రొ కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో కలిసారు. పార్ట్ టైం టీచర్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కోదండారం త్వరలో తమ కమిటీ ఉన్నత విద్యా రంగ సమస్యలపై సమావేశం అవుతుందన్నారు. అదే సమావేశంలో సమస్యను చర్చించి వాటిని సీఎం రేవంత్ రెడ్డి ద్వారా చర్చిస్తామన్నారు. అవసరమైతే త్వరలో పార్ట్ టైం టీచర్ల ప్రతినిధి బృందాన్ని సీఎంతో కలిసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి, డా. జానకి రెడ్డి, వర్కింగ్ ప్రసిడెండ్ డా. ఏడుకొండలు పాల్గొన్నారు.

'గాంధీ'లో 30 సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో సమస్యాత్మక ప్రాంతాల్లో 30 అత్యాధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈమేరకు హస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) ఛైర్మన్, జిల్లా కలెక్టర్ నిధులు విడుదల చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. గాంధీఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 213 సీసీ కెమెరాల్లో అధిక శాతం పని చేయకపోవడంతో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని, నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తంటాలు పడుతున్నారనే అంశంపై ..నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. సమస్యాత్మక, కీలక ప్రాంతాల్లో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ. 13.46 లక్షల నిధులను కేటాయించారు. మెయిన్ ఎంట్రెన్స్, సెల్లార్, ఎమర్జెన్సీ, ఓపీ, రిజిస్ట్రేషన్, మార్చురీ, విజిటర్స్‌గేట్, లిఫ్ట్, పార్కింగ్ ఏరియా, కారిడార్ల తదితర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తయి, సీసీ కెమెరాల ఏర్పాటు పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఆస్పత్రి మొత్తం 300 పైగా అత్యాధునిక, నైట్‌విజన్ సీసీ కెమెరాలు, సాంకేతిక నిఘా వ్యవస్థ ఏర్పాటుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపామని, ఎన్నికల కోడ్ ఉండటంతో కార్యారూపం దాల్చేందుకు మరికొంత సమయం పడుతుందని వివరించారు.

కిడ్స్ సమ్మర్ క్యాంపునకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: ఓయూలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ(డీడీఎంఎస్) లిటరసీ హౌస్ అకాడమి క్యాంపస్‌లో నిర్వహించే 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 22 నుంచి మే 23వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని లిటరసీ హౌస్ కార్యదర్శి బి.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 7 నుంచి 12 ఏళ్ల వయసులోపు చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెల రోజులపాటు కొనసాగే ఈ శిబిరంలో కాగితపు సంచులు- ఒరిగామి ఆర్ట్, పాట్ పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫింగర్ పప్పెట్, ఇండీజినియస్(స్వదేశీ) గేమ్స్ తదితర కోర్సులలో శిక్షణ ఉంటుందని చెప్పారు. వివరాలకు 99512 10441, 70134 57432 నంబర్‌లలో సంప్రదించగలరు.

పూలే ఆశయాలను కొనసాగిద్దాం



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ విద్యార్థులు

లాలాపేట: సామాజిక పరివర్తకుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని పలువురు నేతలు పిలుపునిచ్చారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని లాలాపేటలోని ఆయన విగ్రహానికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు, సీపీఐ, బీజేపీ నేతలు, పలు పార్టీల నాయకులు, కుల సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



లాలాపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్

పూలేకు ఘన నివాళి

చిలకలగూడ : సామాజిక తత్వవేత్త, సంఘసంస్కర్త జ్యోతిరావుగోవిందరావు పూలే 198 జయంతి వేడుకలు సీఐటీయు సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ నేతృత్వంలో చిలకలగూడ లేబర్‌అడ్డా వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశలు, ఆశయాల సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు మధు, సూర్యప్రకాశ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను విద్యార్థులు, ఉద్యోగులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్‌కాలేజీ ఎదుట, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌లో, నాన్‌టీచింగ్ కార్యాలయంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు.





నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



చిలకలగూడ ఈద్గా మైదానంలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లిం సోదరులు

ఘనంగా రంజాన్ వేడుకలు

సనత్‌నగర్: పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరిపారు. అలాగే సనత్‌నగర్ డీఎస్‌ఎంకాలనీ మసీదు, ఆలివ్స్ మసీదు, సనత్‌నగర్ బస్టాండ్ వద్ద గల మసీదులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మహ్మద్ ప్రవక్త సూచించిన వాక్యాలను మత పెద్దలు చదివి వినిపించారు. రంజాన్ పండుగ సందర్భంగా మసీదులను అందంగా అలంకరించారు. విద్యుద్దీపాల వెలుగులతో మసీదులు కాంతులీనాయి. ఇక ఉదయం నుంచే ముస్లిం సోదరులు ఈద్గాలు, మసీదుల్లో కలుసుకుని పరస్పరం ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. షీర్‌కుర్మాను ఒకరికొకరు తినిపించుకున్నారు. పలుచోట్ల జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్‌గ్రౌండ్ నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఆ లింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజల పాటు ఎంతో నిష్ఠతో ఉపవా స దీక్షలు చేస్తారన్నారు. కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, రాజేష్‌ముదిరాజ్, ఫాజిల్, జమీర్ పాల్గొన్నారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీక

రసూల్‌పురా: రంజాన్, ఈద్ మిలాప్ పండుగలు మత సామరస్యానికి ప్రతీక అని మల్కాజ్‌గిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రసూల్‌పురా మజీద్ ఈ-ఇలాహీ సమీపంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షేక్ నయిం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రసూల్‌పురాలో అన్ని పండుగలు హిందు, ముస్లీం కుటుంబాలు కలిసికట్టుగా నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు.

సామూహిక ప్రార్థనలు

రసూల్‌పురా: రంజాన్ పండుగా పురస్కరించుకుని బాలంరాయి బడీ ఈద్గాలో సుమారు పదివేల మంది, కార్ఖాన జామియా మసీదు ఈద్గా వద్ద ఐదు వేల మంది ముస్లీం సోదరులు సాముహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఖబరాస్థాన్‌కు వెళ్ళి వారి ఆత్మీయుల సమాదులపై పూలు ఉంచి నివాళులర్పించారు. ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జి. నివేదిత సాయన్న, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్, రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ ముస్లీం సోదరులను వేర్వేరుగా కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

చిలకలగూడ : చిలకలగూడ బడే మసీదు, ఈద్గాల్లో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

పద్మారావునగర్: రంజాన్ పండుగ సందర్భంగా చిలకలగూడ ఈద్గా మైదానం రోడ్డు, బన్సీలాల్‌పేట్, బోయిగూడ, మోండా మార్కెట్, రాణిగంజ్ పరిసర ప్రాంతాల్లో రంజాన్‌సందడి నెలకొంది. చిలకలగూడ ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత





కార్ఖాన జామీయ మసీదు వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిలకలగూడ ఈద్గా మైదానంలో ..



ముస్లిం సోదరులతో కలిసి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు



సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే తలసాని..



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్



ఈద్ ముబారక్ చెబుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నాట్యం, సంగీతంలో ఉచిత శిక్షణ

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని నాట్యశిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వాసుకీ శ్రీనివాస్ తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయం పైఅంతస్తు హాల్‌లో ఈ నెల 25వ తేదీ నుంచి కూచిపూడి, ఆంధ్రనాట్యం, శివ తాండవం, శాస్త్రీయ నృత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 40 రోజులఎపాటు కొనసాగే ఉచిత శిక్షణకు హాజరయ్యే బాలబాలికలకు ఈ నెల 15 నుంచి 25 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వివరాలకు 98493 55145, 80088 24482 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓయూ సాంస్కృతిక పోటీల ఫలితాలు వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 3, 4 తేదీలలో జరిగిన వివిధ పోటీలలో విజేతల వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 26 క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే 107వ ఫౌండేషన్‌లో బహుమతులను, సర్టిఫికెట్లను అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు కోరారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బల్లులు, ఇతర క్రిమికీటకాలు భోజనంలో ఉండటం వల్ల విద్యార్థులు అన్యారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వంటశాలల, భోజనశాలలు పరిశుభ్రంగా ఉండేల చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

అంబర్‌పేట్: కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని శుక్రవారం(నేడు) నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ పులి జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబర్‌పేట చే నంబర్ చౌరస్తాలోని మహారాణ ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీలో మాదిగలకు అన్యాయం : రాములు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే అవకాశం ఇవ్వాలని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత రాములు డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉండగా, ఒక్క చోట కూడా మాదిగలకు సీటు కేటాయించలేదన్నారు. దీంతో బీజేపీ పట్ల మాదిగ వర్గీయులు నిరాశతో ఉన్నారని అన్నారు. ఎస్సీలలోని 59 కులాల్లో 70 శాతం మాదిగ సామాజిక వర్గం వారే ఉన్నారని అన్నారు. బీజేపీ మాదిగలకు తగిన ప్రాధాన్యమివ్వని కారణంగానే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క రిజర్వ్‌డ్ స్థానంలో పార్టీ గెలవలేదన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం తగిన విధంగా ఆలోచించి, మాదిగలకు సీటు ఇవ్వాలన్నారు.

హెల్త్‌కేర్ కోర్సుల స్థాపనకు దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్‌లో 15 హెల్త్‌కేర్ కోర్సుల స్థాపనకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఓయూలో అనుమతితో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు సంవత్సరాల అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా రెండేళ్ల కోర్సులను స్థాపించుకోవచ్చన్నారు. క్యాత్‌ల్యాబ్ టెక్నాలజీ, డయాలసిస్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడికల్ కేర్, ఈకో కార్డియోగ్రఫీ అండ్ సానోగ్రఫీ, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, మెడికల్ ఇమాజింగ్ టెక్నాలజీ, మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ, మెడికల్ ఇన్ఫర్మేటిక్, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్, రెస్పిరేటరీ థెరఫీ టెక్నాలజీ, ఇన్సురెన్స్ అండ్ బిల్లింగ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ కేర్ కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఓయూతో ఒప్పందం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియ వెబ్‌సైట్లో చూడవచ్చు.

ఎన్నికల తర్వాత మత్స్యపరిశ్రమ అభివృద్ధికి చర్యలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్లమెంటు ఎన్నికల తర్వాత మత్స్యకారులకు తోడ్పాటు అందించేవిధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయికుమార్ అభినందన సభ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. సాయి కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులు, సహకార సంఘాలకు అండగా ఉంటుందన్నారు. గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షుడు మంగళపల్లి శంకర్ మాట్లాడుతూ బెస్త, గంగపుత్రులకు చేపల వేట, అమ్మకం కులవృత్తిపై పూర్తి హక్కులు కల్పించి ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. గంగపుత్ర కార్పొరేషన్‌కు రెండు వేల కోట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ఫిషరీస్ కోఆపరేటివ్ ఫెడరేషన్ అధ్యక్షులు కొప్పు పద్మ, ఫిషరీస్ విభాగం వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్షులు సత్యనారాయణ, నర్సయ్య, ప్రవీణ్, పరమేష్, సురేష్, సుమిత్ర, రచ్చ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహనీయుల స్ఫూర్తితో దేశ రాజ్యాంగంతోపాటు దళిత బహుజన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ అంబేద్కరిస్టు జేబీ రాజు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ, బంధు సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జేబీ రాజు మాట్లాడుతూ మహనీయుల పోరాటాల వల్లే నేడు దళిత బహుజనులు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని అన్నారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం గొప్ప ఆనందదాయకమని పేర్కొన్నారు. దళిత బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే వారికి నిజమైన నివాళి అని అన్నారు. బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్, అరుంధతి బంధు సేవా మండలి గ్రేటర్ ప్రధానకార్యదర్శి పవన్ కుమార్, ఎంఐఎఫ్ అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రముఖ విద్యావేత్త లక్ష్మీదేవదత్తు, ప్రముఖ రచయిత్రులు గోగు శ్యామల, జూపాక సుభద్ర తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏడవ వార్డుకు చెందిన వివిధ బస్తీల నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేళ నియోజకవర్గంలో వివిధ పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి అధికార పార్టీ కాంగ్రెస్ లోకి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం క్లాసిక్ గార్డేన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఏడవ వార్డు గాంధీనగర్,లాల్‌బజార్, చిన్న కమేళా, సెంట్రల్ బట్రికి చెందిన రెండు వందల మంది పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు, శ్రీ గణేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చింతపండు మల్లేశ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్‌లోని సుప్రసిద్ధ పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత చింతపండు మల్లేశ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం దక్కుతుందన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

అడ్డగుట్ట: ఉగాది పండుగను పురస్కరించుకొని తుకారాంగేట్‌లోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరించారు. సంఘం సభ్యులు, సీనియర్ సిటిజన్లు పురం జగదీష్, అమర పెంటయ్య, సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్‌ల చేతుల మీదుగా క్రోధి నామ సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

సనత్‌నగర్: గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ శ్రీరాములు తెలిపిన మేరకు.. ఈ నెల 9న రసూల్‌పురా ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని జబ్బార్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. అయితే మృతుని వివరాలు తెలియరాలేదు.